

ఉషోదయ-టీటీడీ రోడ్డులో ఫుట్‌పాత్ నిర్మించనున్న ప్రాంతం



19వ వార్డు జాలరిపేటలో శరవేగంగా జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

రహదారుల కళకళ



రూ.29.50 లక్షలతో నిర్మించిన టీటీడీ కూడలి రోడ్డు

- ఎంవీపీ కాలనీలో అభివృద్ధి పరుగులు
- 17వ వార్డులో రూ.29.50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం
- రూ.16 లక్షలతో ఫుట్‌పాత్ నిర్మాణ పనులు
- 19వ వార్డు జాలరిపేటలో రూ.93 లక్షలతో ప్రధాన రహదారి అభివృద్ధి





ఉషోదయ కూడలిలో ఫుట్‌పాత్ నిర్మాణం కోసం వేగంగా జరుగుతున్న పనులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17, 18, 19 వార్డుల్లో రహదారులు కళకళలాడుతున్నాయి. వార్డుల ఆధునికీకరణ పనుల్లో భాగంగా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ప్రధాన రహదారుల నిర్మాణంతో పాటు డ్రైనేజీల అభివృద్ధి, ఫుట్‌పాత్‌ల నిర్మాణ పనులు చేపట్టింది. పలు వార్డుల్లో ఇప్పటికే పనులు పూర్తయి రహదారులు కళకళలాడుతుండగా.. మరి కొన్ని వార్డుల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో పాటు ఎంవీపీ కాలనీలో ఆహ్లాదం కలిగించేలా వాల్ ప్లాంటేషన్, లవ్ ఎంవీపీ కాలనీ నమోనాలను తీర్చిదిద్దారు. ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కూడలి, ఉషోదయ కూడళ్లను అభివృద్ధి చేయడంతో పాటు ఫౌంటైన్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

- జీవీఎంసీ 17వ వార్డు కార్పొరేటర్ ప్రతిపాదనలకు అనుగుణంగా రూ.94 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఉషోదయ కూడలి నుంచి టీటీడీ కూడలి వరకు రహదారిని నిర్మించారు. రూ.29.50 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. వార్డులోని దలైవారి వీధిలో రూ.48 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఉషోదయ కూడలిలో టీటీడీ రోడ్డును ఆనుకుని రూ.16 లక్షల వ్యయంతో ఫుట్‌పాత్ నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. స్థానికులు, పాదచారులతో పాటు వాహనదారుల అవసరాలకు అనుగుణంగా ఆయా పనులు చేపడుతున్నారు. రూ.36 లక్షలతో ఉషోదయ కూడలిని అభివృద్ధి చేస్తున్నారు.



రూ.30 లక్షలతో నిర్మించిన అప్పుఘర్ కూడలి రోడ్డు

- జీవీఎంసీ 19వ వార్డులోని జాలరిపేట ప్రధాన రహదారి ఆధునికీకరణ పనులకు గత నెలలో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. రూ.93 లక్షలతో ఈ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. 18వ వార్డులో ఎంవీపీ కూడలి నుంచి అప్పుఘర్ కూడలి వరకు రూ.30 లక్షల వ్యయంతో రహదారి నిర్మాణం పూర్తి చేశారు. ఎంవీపీ కాలనీ ఆధునికీకరణలో భాగంగా ఏఎస్ రాజా కూడలిని అత్యాధునికంగా సుందరీకరిస్తున్నారు. దీంతో పాటు కాలనీలో వాల్ ప్లాంట్ డెకరేషన్‌తో కూడిన ఎట్ లవ్ ఎంవీపీ కాలనీ నమూనాని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. అప్పుఘర్ కూడలి నుంచి వాల్తేర్ కూడలికి వెళ్లే మార్గంలోను వాల్ ప్లాంట్ డెకరేషన్‌ను ఏర్పాటు చేశారు.

అన్ని సౌకర్యాలు అందుబాటులోకి..



17వ వార్డులో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణం, కూడళ్ల అభివృద్ధి చేపట్టారు. ఉషోదయ కూడలిలో ఇప్పటికే బీటీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేశారు. ఫుట్‌పాత్‌తో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కూడా చేపట్టారు. దలైవారి వీధిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం స్థానికుల చిరకాల స్వప్నం. ఇది త్వరలో సాకారం కానుంది. దీంతో పాటు ఫుట్ పాత్ నిర్మాణంతో ఉషోదయ కూడలి మరింత ఆధునికతను సంతరించుకోనుంది.

– పీలా సత్యవతి, ఆదర్శనగర్ , 17వ వార్డు

మారిన ఎంవీపీ కాలనీ ముఖచిత్రం



ఎంవీపీ కాలనీ పరిధిలో 17, 18, 19 వార్డుల్లో ప్రభుత్వం అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టింది. రోడ్లు, కాలువలు, ఫుట్‌పాత్‌లు ఇలా వసతులన్నీ ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. రహదారులతో పాటు ఫుట్‌పాత్‌లను పెద్ద ఎత్తున సుందరీకరించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. జాలరిపేటలో దశాబ్దాలుగా ఉన్న సమస్యలకు పరిష్కారం లభించింది.

– బడే ఎల్లాజీ, అప్పుఘర్, 18వ వార్డు

క్లుప్తంగా

‘అందరి నోట ఘంటసాల పాట’ రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్.ఎస్.కె.మహంతి

బీచ్ రోడ్డు: సినీ గాయకుడు ఘంటసాల 101వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం అందరి నోట ఘంటసాల పాట పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు ఘంటసాల, అమ్మజమ్మ ట్రస్టుల అధ్యక్షుడు ఎస్.ఎస్.కె.మహంతి తెలిపారు. ఈ మేరకు బుధవారం రామ్‌నగర్‌లోని తర కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంగీత విభావరి జరగనుందన్నారు. ప్రముఖ గాయకులు పీవీ రమణ, కె.రాజేంద్రప్రసాద్, బి.ఫణిభూషణ్, కె.ఎస్.ప్రకాష్, కల్యాణి, శ్రీవిద్య, మంగవేణి, తదితరులు మధుర గీతాలు ఆలపించనున్నారన్నారు. తొలి చిత్రం ఉపేంద్ర గాడి అడ్డాతో గుర్తింపు పొందిన కంచర్ల ఉపేంద్రబాబును కళా పురస్కారంతో సన్మానించనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చెన్నా తిరుమలరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలకు 300 మంది దివ్యాంగుల దరఖాస్తు



దివ్యాంగుడి ఉపకరణాల కోసం పరిశీలిస్తున్న సిబ్బంది

సీతంపేట: దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని బీజేపీ పార్వతీపురం ఇన్‌చార్జి ఎస్.వి.ఎస్.ప్రకాష్‌రెడ్డి ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆలీముకో జిల్లా యంత్రాంగం, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు ఆధ్వర్యంలో బుధవారం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రధాని మోదీ ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారన్నారు. సుమారు 300 మంది దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేశారు. వారికి ఆరు నుంచి 8 వారాల్లో ఉపకరణాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, పుట్ట గంగయ్య, రామ్‌కుమార్, దానేష్, దుర్గరాజు, జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, ఏపీడీ దుర్గాప్రసాద్, కో ఆర్డినేటర్ రూపాకుల రవికుమార్ పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ మందులివ్వాలి



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్

ఆరిలోవ: గొర్రెలు, మేకలకు నాణ్యమైన డీవార్మింగ్ మందులు, అవసరమైన టీకాలను ఉచితంగా వేయాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం అధ్యక్షుడు గంటా శ్రీరామ్ కోరారు. హనుమంతవాక వద్ద పశు సంవర్ధక శాఖ కార్యాలయం సముదాయంలో గొర్రెలు, మేకల సహకార యూనియన్ కార్యాలయంలో బుధవారం గొర్రెలు, మేకల పెంపకందార్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకందార్లకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు కారణంగా గొర్రెలు, మేకలు మృతి చెందుతున్నాయని, అలాంటి సమయంలో పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. సంవత్సరానికి నాలుగు సార్లు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటుకు విజ్ఞప్తి



పి.వి.సింధుతో కులిడి సురేష్‌బాబు

బీచ్‌రోడ్డు: విశాఖలో బ్యాడ్మింటన్ అకాడమీని ఏర్పాటు చేయాలని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కులిడి సురేష్‌బాబు బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధుని కోరారు. బుధవారం విజయవాడలోని ఆమెను కలిసిన సురేష్‌బాబు పలు అంశాలను చర్చించి, ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ ముందుంటారని చెప్పారు. అందులో భాగంగా ఈ ఏడాది ఆడుదాం .. ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఇటువంటి పోటీల్లో యువతకు శిక్షణ ఇచ్చేందుకు అకాడమీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఇందుకు సింధు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

రోడ్లు, కాలువల పనులకు శంకుస్థాపన



11వ వార్డు రాజీవ్‌నగర్‌లో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు పలు కాలనీల్లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. రూ.46 లక్షల జీవీఎంసీ నిధులతో బాలాజీనగర్‌లో కాలువలు, రాజీవ్‌నగర్, స్వామి వివేకానందనగర్‌లలో తారు రోడ్లు నిర్మాణం కోసం బుధవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ పనులు త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం మేయర్ స్థానికులను పలకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో అన్ని కాలనీల్లోనూ పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో కొత్తగా యూపీహెచ్‌సీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఇక్కడ గెడ్డ ఆధునికీకరించామన్నారు. బాలాజీనగ్‌లో రూ.15 లక్షలతో కాలువలు, రాజీవ్‌నగర్‌లో రూ.15 లక్షలతో బీటీ రోడ్లు, స్వామి వివేకానందనగర్‌లో రూ.16 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ‘అక్షయ పాత్ర’ వార్షికోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ నిష్కించిన భక్తదాస

బీచ్ రోడ్డు: అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా గత 15 ఏళ్లలో 10 కోట్ల భోజనాలు పంపిణీ చేశామని డాక్టర్ నిష్కించిన భక్తదాస తెలిపారు. ఫౌండేషన్ 15వ వార్షికోత్సవాన్ని నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో ఏడు పాఠశాలలకు వర్తింపజేసిన ఈ పథకం కింద ప్రస్తుతం 132 స్కూళ్లలో 25 వేల మందికి మధ్యాహ్న భోజనం, 36 స్కూళ్లలో 4 వేల మందికి అల్పాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అక్షయపాత్ర 10 వంటశాలల నుంచి 1,30,000 మందికి పిల్లలకు సేవలు అందిస్తుందన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రతిభ కనబరిచిన 12 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, సర్వశిక్ష అభియాన్ పీడీ శ్రీనివాస, ప్రేమ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సుంకర వెంకటఆదినారాయణ రావు, డాక్టర్ శశిప్రభ, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

ఎంవీపీ కాలనీ: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కైలాసగిరి రోప్ వే, సులభ కాంప్లెక్స్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో కర్రి సాయి, గోషిక నితిన్, కొర్రా కృపాసాగర్ కలిసి గంజాయి విక్రయిస్తుండగా ఎంవీపీ పోలీసు స్టేషన్ ఎస్ఐ శ్రీను బృందం పట్టుకుంది. వారి నుంచి కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సాయి, నితిన్‌లది హైదరాబాద్ కాగా.. కృపాసాగర్ అల్లూరు సీతారామరాజు జిల్లాకు చెందిన వ్యక్తి. పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమానికే మళ్లీ పట్టం కట్టాలి



21వ వార్డులో పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న జీవీ



17వ వార్డులో జగన్ పాలనపై అవగాహన కల్పిస్తున్న గేదెల నాగరాజు

బీచ్ రోడ్డు: గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు జీవీ పిలుపునిచ్చారు. బుధవారం 22వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు కార్యక్రమం ద్వారా వచ్చిన మార్పులను గమనించాలన్నారు. ఆర్థిక ప్రగతిలో గత ప్రభుత్వంలో ఏ విధంగా ఉన్నామో.. వైఎస్సార్‌సీపీ సర్కారులో ఏవిధంగా ఉన్నామో గడపగడపకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

రాష్ట్ర వ్యాప్తంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు జీవీ అన్నారు. బుధవారం 21వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో పథకాల బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం జీవీ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో 17వ స్థానంలో ఉన్న విద్యా రంగం సీఎం జగన్ పాలనలో 3వ స్థానానికి చేరుకుందన్నారు. అటువంటి వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జి మధుపాడ రవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర ప్రజల సంక్షేమం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని కార్పొరేటర్ గేదెల లావణ్య ఆధ్వర్యంలో బుధవారం ఎంవీపీ కాలనీ 17వ వార్డులో ఘనంగా నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్ నాయకత్వం రాష్ట్రానికి ఎందుకు కావాలో వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలు



ఏయూలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు



పదో వార్డులో మహిళలకు చీరలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఏయూ క్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు రాష్ట్రంలో విద్యార్థులకు పండుగ రోజని వైఎస్ఆర్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల నిషేక్ అన్నారు. బుధవారం ఏయూలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం ముందస్తు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం బత్తుల నిషేక్ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాల ఫలితాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ విద్యార్థి యూనియన్ రీజినల్ కోఆర్డినేటర్ రెల్ల జానకీరావు, నాయకులు జగన్, మాధవ రెడ్డి, రాజ్‌కుమార్, భరత్, కౌశిక్, ధీరజ్, నాని, నవీన్ దాస్, స్వామి నాయక్, శ్రీరామ్ పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు రవీంద్రనగర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాజీ కార్పొరేటర్ జగ్గపిల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొలి అప్పారావు కేక్ కట్ చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్తూ వ్యక్తి మృతి

బీచ్ రోడ్డు: ద్విచక్ర వాహనంపై వెళ్తూ అనారోగ్యానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రామారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్టీఆర్ కాలనీకి చెందిన నక్క శివ(43) వీఐపీ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. బీపీ, షుగర్ పెరిగిపోవడంతో బైక్ పైనుంచి పడిపోయాడు. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

‘పరవస్తు’కు ఘన నివాళి



పరవస్తు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో పరవస్తు చిన్నయసూరి జయంతి బుధవారం నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు ముఖ్యఅతిథిగా హాజరై ముందుగా చిన్నయసూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలుగు భాషకు వ్యాకరణ సంప్రదాయానికి చిన్నయసూరి అందించిన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, డాక్టర్ డి.వి.సూర్యారావు, ఆచార్య వి.సిమ్మన్న, పరవస్తు ఫణి శయన సూరి, డాక్టర్ యోగి, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్ సదస్సులో అపోలో వైద్యుడి ప్రసంగం



అబ్దుల్ ఖాన్

ఆరిలోవ: లక్నోలో ఈ నెల 14న జరిగిన ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ వార్షిక సదస్సు విశాఖ అపోలో ఆస్పత్రి ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ అబ్దుల్ డి.ఖాన్ పాల్గొని ప్రసంగించారు. ఇటీవల రెండేళ్లుగా మడమ వద్ద నొప్పితో బాధపడుతున్న 54 ఏళ్ల వ్యక్తికి థెరిప్యూటిక్ హిండ్‌ఫుట్ ఎండోస్కోపిక్ కాల్కానియో ప్లాస్టీ ద్వారా చేసిన అరుదైన శస్త్ర చికిత్స గురించి ఆయన వివరించారు. ఈ సందర్భంగా బుధవారం ఖాన్‌ను అపోలో వైద్యులు అభినందించారు.

కంటెంట్‌తో మెరుగ్గా బోధన



కప్పరాడ స్కూల్‌లో విద్యార్థినితో మాట్లాడుతున్న విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కుమార్

కంచరపాలెం: ఐఎఫ్‌పీ ప్యానల్స్, బైజూస్ కంటెంట్‌ను వినియోగించుకుంటూ విద్యార్థులకు పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఐఏఎస్ అధికారి సురేష్‌కుమార్ సూచించారు. ఐటీఐ కూడలిలోని కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. వివిధ సబ్జెక్టులపై విద్యార్థుల విషయ పరిజ్ఞానం, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. తరగతుల్లో ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డుల వాడకం, బైజూస్ కంటెంట్‌ను వినియోగించుకుంటూ జరుగుతున్న బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు విద్యా లక్ష్యాల సాధనకు తగు సూచనలిచ్చారు.

- కప్పరాడ ప్రాథమిక పాఠశాలలో బాల్యం కేంద్రాన్ని ఐఏఎస్ అధికారి సురేష్‌కుమార్ సందర్శించి, విద్యార్థులతో ఆల్ఫాబెట్స్ రాయించారు. ఒకటో తరగతి విద్యార్థుల చేత వ్యక్తిగతంగా కూడికలు చేయించారు. ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి తగు సూచనలిచ్చారు. ఉపాధ్యాయుల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు చేపట్టాలని జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీసీ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ విజయమాలిని తదితరులు పాల్గొన్నారు.